క్లుప్తంగా

నిమ్మతండాలో నియోజకవర్గ స్థాయి క్యారమ్స్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండా పరిధిలోని నిమ్మతండాలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్యారంబోర్డు పోటీలను గురువారం సర్పంచ్ శాంతినాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాలకృష్ణ, రవీందర్‌నాయక్, గోవిందునాయక్, వేలాద్రి నాయక్, నాగరాజునాయక్, సుర్యా బ్రదర్స్ ఆర్గనైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

సుధా బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



సుధా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ గణేష్‌ను సన్మానిస్తున్న శారీ సెంటర్ నిర్వాహకులు

గరిడేపల్లి : సుధా బ్యాంకు ద్వారా దుకాణదారులకు, వ్యాపారస్తులకు వివిధ రకాల రుణాలను ఇవ్వనున్నట్లు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీమహాలక్ష్మి శారీ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యాపార విస్తరణకై దుకాణదారులకు తాకట్టు రుణాలు, గృహ రుణాలు, ఆస్తిపై తాకట్టు రుణాలు, గిడ్డంగి సర్ప్ సర్టిఫికెట్ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కరెంట్ అకౌంట్, సేవింగ్ అకౌంట్‌పై యూపీఏ సేవల ద్వారా సులభంగా ఆన్‌లైన్ పేమెంట్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలు తమ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయనను శారీ సెంటర్ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సుధా బ్యాంక్ హుజూర్‌నగర్ మేనేజర్ ఇల్లింద్ర సురేష్, శారీ సెంటర్ నిర్వాహకులు శ్రీరంగం కవితరత్నాకర్ పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ



చేపపిల్లలు వదులుతున్న మత్స్యకారులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల నల్ల చెరువు, పెద్ద చెరువు, లింగ చెరువుల్లో గురువారం 45 వేల చేప పిల్లలను వదిలినట్లు మత్స్య సొసైటీ చైర్మన్ గువ్వల ధనమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెరువులపై మత్స్యశాఖ ఏడీఈ భూపేందర్‌సింగ్ తమకు పూర్తిహక్కులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గువ్వల వీరయ్య, ఆంజనేయులు, వెంకన్న, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రామలక్ష్మి కోరారు. గురువారం మండల పరిధిలోని సిరిపురం, నారాయణపురం గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దని, ఐకేపీ కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులు ఐక్యం కావాలి

హుజూర్‌నగర్ : భారతదేశాన్ని హిందూ మతదేశంగా చేయాలని చూస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులు ఐక్యం కావాలని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నాగబూషణం, రఘురామిరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలతారెడ్డి పరామర్శ



మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న శ్రీలతారెడ్డి

గరిడేపల్లి : మండలంలోని గంగానగర్ గ్రామానికి చెందిన పందిరి స్రవంతి గురువారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని నేరేడుచర్ల మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ చల్లా శ్రీలతారెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బాల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కుక్కడపు వెంకటేశ్వర్లు, బీఎంఎస్ జిల్లా కార్యదర్శి కాటూరి శేషగిరిరావు, బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్య, నాయకులు నాగయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

గ్రామాల్లో ‘పల్లె వెలుగు’ జాడేదీ

- బస్సు సౌకర్యం లేక ప్రయాణికుల అవస్థలు
- పరిమితికి మించి ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



బస్సు సౌకర్యం లేక ఆటోలో పరిమితికి మించి ప్రయాణిస్తున్న ప్రజలు



కోదాడ నుంచి బూరుగడ్డ మీదుగా గానుగబండ వెళ్తున్న ఆర్టీసీ బస్సు (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నిత్యం వివిధ పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లడానికి ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు పరిమితికి మించి తరలిస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. అయితే మండలంలోని బూరుగడ్డ మాచవరం, కరక్కాయలగూడెం, మర్రిగూడెం, లింగగిరి, శ్రీనివాసపురం, లక్కవరం, అమరవరం, సీతారాంపురం, అంజలిపురం తదితర గ్రామాలకు బీటీ రహదారులు బాగున్నాయి. కానీ ఆర్టీసీ బస్సుల సౌకర్యం మాత్రం కరువైంది. మండల కేంద్రానికి కూత వేటు దూరంలోనే ఉన్న బూరుగడ్డ మాచవరం గ్రామానికి సైతం నేటికీ బస్సు సౌకర్యం లేదు. గతంలో కోదాడ నుంచి బూరుగడ్డ మీదుగా గానుగబండ వరకు బస్సులు నడిపారు. పాలకుల ఒత్తిడితో ఆయా గ్రామాలకు కొన్నాళ్లు బస్సులు నడిపినప్పటికీ ఆదాయం రావడం లేదనే సాకుతో అధికారులు బస్సులను నిలిపివేశారు.దీంతో పల్లె ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లి తిరిగి రావడం ఆలస్యమైతే చివరకు ఆటోలు కూడా అందుబాటులో లేక నానా అవస్థలు పడుతున్నారు.

విద్యార్థులకు తిప్పలు..

వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రం, ఇతర గ్రామాలు, జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు బస్సులు లేక ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆటోవాలాలు ఇదే అదునుగా చేసుకుని సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అదే విధంగా సరైన సమయానికి కాలేజీలు, పాఠశాలలకు వెళ్లలేక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని అనేక సార్లు ఆందోళనలు, రాస్తారోకోలు చేసినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పూట పాల ఉత్పత్తిదారులు, కూలీ పనులకు వెళ్లే ప్రజలు, రైతులు బస్సుల కోసం తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆటోల్లో రెట్టింపు చార్జి



గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బస్సులు రాకపోవంతో ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. బస్సు టికెట్ కంటే ఆటో చార్జి రెట్టింపు తీసుకుంటున్నారు. ప్రశ్నిస్తే ఆటో దిగి పొమ్మంటున్నారు.

– షేక్ ఇమామ్, కరక్కాయలగూడెం

బస్సులు పునరుద్ధరించాలి



గతంలో రహదారులు సరిగ్గా లేవని బస్సులు నిలిపివేశారు. ఇప్పుడు ఏ గ్రామంలో చూసినా రోడ్ల సౌకర్యం చాలా బాగుంది. కానీ నేటికీ రవాణా సౌకర్యం కల్పించడం లేదు. ప్రజల సౌకర్యార్థం బస్సులు వెంటనే పునరుద్ధరించాలి.

– మాడుగుల పరుశురాం, బూరుగడ్డ మాచవరం

కాలేజీకి వెళ్లేందుకు ఇబ్బందులు



విద్యార్థులు కాలేజీ, పాఠశాలలకు వెళ్లేందుకు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి. సమయానికి బస్సులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– ఎలుగూరి మల్లికార్జున్, డిగ్రీ విద్యార్థి, బూరుగడ్డ

ప్రశాంతంగా ‘ఉపాధి’పై సామాజిక తనిఖీ



ఉపాధి హామీ సామాజిక తనిఖీలో పాల్గొన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్

చిలుకూరు : గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీ పనులు సక్రమంగా కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల కోడ్ ఉండడంతో మండల పరిషత్ కార్యాలయ గదిలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్ సమక్షంలో గ్రామాల వారిగా సామాజిక తనిఖీ నిర్వహించారు. 2021 జులై 1 నుంచి 2023 మార్చి 31 వరకు సుమారుగా 2 వేల పనులు (రూ.7 కోట్ల) జరగగా రూ.6 కోట్లను ఉపాధి కూలీలకు, కోటి రూపాయలను మెటీరియల్‌కు చెల్లించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, అంబుడ్స్ మెన్ లచ్చిరాంనాయక్, క్లస్టర్ ఏపీడీ అన్సారీ, విజిలెన్స్ అధికారి ఆశా, ఎంపీడీఓ ఈదయ్య, ఎస్‌ఆర్‌పీ రమేష్, ఏపీఓ నిర్మల, ఈసీ మాధవి, టీఏలు గిరి, స్రవంతి, కంప్యూటర్ ఆపరేటర్ ఉపేందర్, డీఆర్పీలు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వీఆర్‌పీలు పాల్గొన్నారు.

పేదలకు కాంగ్రెస్ పార్టీ శ్రీరామరక్ష

- కాంగ్రెస్ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మావతిరెడ్డి



అనంతగిరిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పద్మావతిరెడ్డి

అనంతగిరి : పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ శ్రీరామరక్షగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఖానాపురం, వెంకట్రాంపురం, మీట్యాతండా, పాతగోల్‌తండా, కొత్తగోల్‌తండా, అమీనాబాద్ గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే కోదాడ అభివృద్ధికి చేసిందేమీ లేదని, ప్రజలను నానా ఇబ్బందులు, భయభ్రాంతులకు గురిచేసిన సంఘటనలే దర్శనమిస్తున్నాయన్నారు. నియోజవర్గం, రాష్ట్రంలో అంతా అవినీతి రాజకీయలేనని, బీఆర్‌ఎస్ కల్లబొల్లి మాటలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తుందన్నారు. అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను తరిమికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, గునుకుల గోపాల్‌రెడ్డి, కొండపల్లి వాసు, బాణోతు బాబునాయక్, మాజీ జెడ్పీటీసీ బాణోతు ధనలక్ష్మి జొన్నలగడ్డ కోటేశ్వరరావు, గుర్రం వెంకటరెడ్డి, డేగ కొండయ్య, డేగ శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం దుర్గామాతకు భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మండపాల వద్ద కుంకుమ పూజలు, చండీ హోమం నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



మఠంపల్లి : యాతవాకిళ్లలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



హుజూర్‌నగర్ : వనదేవత అలంకరణలో అమ్మవారు



కోదాడఅర్బన్ : మంగళగౌరీ అవతారంలో అమ్మవారిని అలంకరించి పూజలు చేస్తున్న భక్తులు



నేరేడుచర్ల : విజయదుర్గ ఆలయంలో..



హుజూర్‌నగర్‌రూరల్ : బూరుగడ్డలో అమ్మవారి మండపం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



గరిడేపల్లి: కోదండరామస్వామి ఆలయం వద్ద చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు



నేరేడుచర్ల : శివాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నమ్మిన వారిని కాపాడుకోవడానికి రాజీనామా

హుజూర్‌నగర్ : నమ్మిన వారిని కాపాడుకోవటం కోసం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన, భర్త గెల్లి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విలువలను కాపాడటం కోసం, వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవడం కోసం నన్ను నమ్మిన వాళ్లను కాపాడుకోవటం కోసం రాజీనామా చేసినట్లు తెలిపారు. ఇన్నాళ్లు తమను ఆదరించి అండగా నిలిచిన వారికి, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

నడిగూడెం : మండల పరిధిలోని శ్రీరంగాపురంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి మంజూరైన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, సీఎస్సీ కేంద్రం నిర్వాహకురాలు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

మోతె : బొల్లం మల్లయ్యయాదవ్‌ను కోదాడ ఎమ్మెల్యేగా అధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు కోరారు. గురువారం మండల పరిధిలోని సిరికొండలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బూత్ స్థాయి, వార్డుల స్థాయి కమిటీలను నియమించారు. ఈ సమావేశంలో ఏలూరు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మద్ది మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ కేంద్రాలను అర్హులే నిర్వహించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్



ఫిజియోథెరపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్

హుజూర్‌నగర్ : ఫిజియోథెరపీ కేంద్రాలను అర్హత కలిగిన వారు మాత్రమే నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని పలు ఫిజియోథెరపీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుల డిగ్రీ అర్హత సర్టిఫికెట్లు, డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నమోదైన ధృవపత్రాలు, పారామెడికల్ బోర్డు సర్టిఫికేట్లను, ఆయా కేంద్రాలలో వసతులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమతులు తీసుకున్న వారు మాత్రమే ఫిజియోథెరపీ కేంద్రాలను నిర్వహించాలని, అనుమతులు లేకుంటే నిర్వాహకులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ అంజయ్య, ఆయా కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

2.50 లక్షల మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు



బక్కమంతులగూడెం నర్సరీలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో 29 నర్సరీలు ఏర్పాటు చేసి సుమారు 2 లక్షల 50 వేల మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ ఎం.జానకిరాములు తెలిపారు. గురువారం మండలంలోని బక్కమంతులగూడెం, చౌటపల్లి, అల్లీపురం, లాలితండా, తదితర గ్రామాల్లో నర్సరీల్లో మట్టి జల్లెడ పట్టించడం, బ్యాగ్ ఫిల్లింగ్ తదితర పనులను పరిశీలించి మాట్లాడారు. ఈనెల చివరి నాటికి విత్తనాలు నాటించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ ఉమాదేవి, టీఏలు నరసింహ, బుంగయ్య, సక్రునాయక్, మల్సూరు, పంచాయతీ కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, నరేందర్ రెడ్డి, కవిత, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

మాయమాటలు చెప్పే నాయకులను నమ్మొద్దు



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ కవిత

కోదాడరూరల్ : నిత్యం అందుబాటులో ఉండే ప్రజల మనిషి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అల్వాలపురం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి బీఆర్‌ఎస్ ప్రచారాన్ని ఆమె ప్రారంభించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మరిన్ని పథకాలు అందుతాయని తెలిపారు. ఎన్నికలప్పుడు వచ్చి మాయమాటలు చెప్పే నాయకులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కోదాడలో ఎగిరేది గులాబీ జెండానే

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



అనంతగిరి : శాంతినగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడఅర్బన్ : చిరు వ్యాపారుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

అనంతగిరి : కోదాడ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండానే ఎగురుతుందని బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ మండల బూత్ కమిటీ, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. మరోసారి రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జి. రమేష్, ఈదుల కృష్ణయ్య, వెంపటి వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తా

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం పక్కన గల శ్రీరామ కల్యాణ మండపం ప్రాంతంలోని ఖాళీ స్థలంలో డబ్బా కొట్లు ఏర్పాటు వేసుకొని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తానని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం కోదాడలో చిరు వ్యాపారుల కార్మిక సంఘం నాయకుడు షేక్ నయీం అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారుల సమస్యలను నయీం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీ, వక్ఫ్ బోర్డ్, కల్యాణ మండపం వారితో మాట్లాడి చిరు వ్యాపారులకు మినీ షాపులు నిర్మించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వ స్థలాల్లో గల దుకాణదారులకు మినీ షాపులు నిర్మించి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు మధు, దహీం బాయ్, మెట్రోనవాబు, నరహరి, రామారావు, పాండు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నాయకులు సమన్వయంతో పనిచేయాలి

నడిగూడెం : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సమన్వయంతో పని చేసి కోదాడ ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఎన్నికల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా అవలంబించాల్సిన విధి విధానాలు, వ్యూహాలపై దిశ నిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, ఎంపీపీ యాతాకుల జ్యోతి, బీఆర్‌ఎస్ నాయకులు వెంపటి వెంకటేశ్వరరావు, దేవబత్తిని సురేష్ ప్రసాద్, పుట్టా రమేష్, గోసుల రాజేష్, వెంకటనర్సయ్య, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, ఆంజనేయులు, జలీల్ పాల్గొన్నారు.

సామాజిక సేవే నా గెలుపునకు పునాది



మట్టపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి పిల్లుట్ల రఘు

మఠంపల్లి : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలే నా గెలుపునకు పునాది అని ఓజో ఫౌండేషన్ చైర్మన్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లుట్ల రఘు అన్నారు. గురువారం మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్య క్షేత్రంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మట్టపల్లి, ఎన్‌సీఎల్, రామచంద్రాపురంతండా, భీమ్లాతండా, భోజ్యాతండా, గుర్రంబోడుతండా, క్రిష్ణతండా, పెదవీడులలో ప్రచారం నిర్వహించారు. మఠంపల్లిలోని శుభవార్త చర్చిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ తాను స్థానికుడనని, ఓజో ఫౌండేషన్ ద్వారా అందించిన సామాజిక సేవలను ప్రజలే గుర్తుచేస్తూ తనను ఆశీర్వదిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు కుక్కల వెంకన్న రామాంజిగౌడ్, శివశంకర్‌యాదవ్, సైదులుముదిరాజ్, రవినాయక్, నరేష్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో ఇమడలేక రాజీనామా చేస్తున్నాం



రాజీనామా పత్రం చూపుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్, మున్సిపల్ మాజీ చైర్మన్, నాయకులు

హుజూర్‌నగర్ : బీఆర్‌ఎస్ పార్టీలో నియంత పోకడల వల్ల ఇమడలేక బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ దొంతగాని లక్ష్మమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం హుజూర్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపు మేరకు బీఆర్‌ఎస్‌లోకి వచ్చి, ఎమ్మెల్యే సైదిరెడ్డితో కలిసి పని చేశామని చెప్పారు. కానీ మాట తప్పిన వారితో పని చేయలేమని, ఆత్మగౌరవం దెబ్బతీసుకుని రాజకీయాల్లో ఉండలేమన్నారు. ఆత్మగౌరవంతో రాజకీయాలు చేయాలని కాని బానిసలుగా రాజకీయం చేయలేమని అందుకే రాజీనామా చేస్తున్నామని తెలిపారు. అందరితో చర్చించి ఏ పార్టీలోకి వెళ్లేది త్వరలో వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిలర్ దొంతగాని పద్మ, మాజీ కౌన్సిలర్ రవి నాయక్, ఉప సర్పంచ్ సావిత్రి వీరారెడ్డి, కె.రామకృష్ణ, బి.కొండారెడ్డి, పలువురు వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సాగర్ కాలువకు నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న పారేపల్లి శేఖర్‌రావు

నేరేడుచర్ల : నాగార్జునసాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం అరిబండి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8వ తేదీ నుంచి 16 వరకు సాగర్‌నీటిని విడుదల చేసినప్పటికీ, పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో చివరి భూములకు నీరందక పొట్టదశలో ఉన్న వరి పంట ఎండుతుందన్నారు. బావులు, బోర్ల కింద 10 గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని అన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, పాతూరి శ్రీనివాస్‌రావు, వెంకటయ్య, నాగేశ్వర్‌రావు, ఏసు, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అవినీతి పార్టీలు

సూర్యాపేట రూరల్ : బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అవినీతి పార్టీలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం రాముల తండాలో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ కొత్తవేషంలో గృహలక్ష్మి పథకం పేరుతో వస్తున్నాడని అన్నారు. ఎన్నికలు రాగానే సీఎం కేసీఆర్‌కు పథకాలు గుర్తుకు వస్తాయని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులకే ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ప్రకటించిన హామీలు ఏ ఒక్కటి నెరవేరలేదన్నారు. విద్యా, ఉపాధి అవకాశాలు రావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటి కిషన్, శశి, సత్యనారాయణ, రమేష్, సురేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.